

రేపు హార్సిలీహిల్స్‌లో యోగాంధ్ర : కలెక్టర్

ప్రజాశక్తి రాయచోటి

హార్సిలీహిల్స్‌లో ఈ నెల 19వ తేదీన యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ హార్సిలీహిల్స్‌లో వెయ్యి మందితో నిర్వహించబోయే యోగాంధ్ర కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేసుకోవాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా వివిధ పర్యాటక కేంద్రాలలో నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నెల 19న హార్సిలీహిల్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా చూసుకోవాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణంను ప్రత్యేకంగా ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, జిఎస్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారి లక్ష్మీపతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

మామిడి రైతులకు అండగా ప్రభుత్వం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. జిల్లాలో పండే తోతాపురి రకం మామిడి చిట్టచివరి కాయ అమ్ముడుపోయే వరకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే రూ.నాలుగు మద్దతు ధర ఆగిపోతుందని అపోహ వద్దని చెప్పారు. టోకెన్ పద్ధతి ద్వారా వ్యాపారులకు, పల్ప్ యూనిట్లకు సరుకు అందజేస్తామని పేర్కొన్నారు. తోతాపూరి మామిడి పండించే రైతుల కోసం కలెక్టరేట్లో సమాచార కేంద్రం (24/7) ఏర్పాటు చేస్తామన్నారు. మంగళవారం మండలంలోని మైసూరువారిపల్లె పంచాయతీ పరిధిలోని ప్రయివేట్ మామిడికాయల మండిలను కలెక్టర్ పరిశీలించారు. మండీ యజమానులు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తోతాపురి మామిడికి మద్దతు ధరపై కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని రైతులు 10 వేల హెక్టార్లలో తోతాపురి రకం మామిడి పండిస్తున్నారని తెలిపారు. 50 శాతం వరకు పంట కోత పూర్తి అయిందన్నారు. 25 వేల మెట్రిక్ టన్నులు వివిధ మార్కెట్లకు వెళ్లిపోయిందని తెలిపారు. ఇంకనూ 25 వేల మెట్రిక్ టన్నులు పంట వచ్చే అవకాశం ఉందన్నారు. గత వారం వరకు ప్రతి రోజు 300 నుండి 400 మెట్రిక్ టన్నుల మామిడి మార్కెట్‌కు వస్తుందని తెలిపారు. రెండు రోజుల నుండి 600 మెట్రిక్ టన్నుల వరకు పంట వస్తుందని తెలిపారు. ఇందులో 30 శాతం పంటను ఉత్తర భారతదేశం నుండి వచ్చే వ్యాపారులు ముఖ్యంగా గుజరాత్, మహారాష్ట్ర వ్యాపారులు తీసుకెళ్తున్నారని, మనకు దగ్గరలో ఉన్న తిరుపతి, చిత్తూరు పల్ప్ యూనిట్‌లలో మిగిలిన 60 నుండి 70 శాతం పంట వ్యాపారుల ద్వారా వెళ్తుందని పేర్కొన్నారు. తోతాపూరి మామిడి పండించే రైతులు ఎటువంటి ఇబ్బంది పడకూడదని, ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు ప్రతి రైతుకు కిలోకి రూ.4 చొప్పున వారికి మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వం జిఒను విడుదల చేసిందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 128 మార్కెట్లలో జిల్లాకు చెందిన వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉద్యోగులను పెట్టి ఎక్కడెక్కడ ఎంత మామిడి వస్తుంది, ఏ వ్యాపారి కొంటున్నారు, ఎటువైపు వెళ్తుంది, ఏ రైతు నుండి కొన్నారు తదితర వివరాలు నమోదు చేస్తామన్నారు. ఆయా రైతులు అమ్మిన ప్రతి కిలోకి సంబంధించిన నగదు వారి ఖాతాలకు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు మన దగ్గర పండే తోతాపురి రకం మామిడి చిట్టచివరి దాకా జూన్ మొదటి వారం నుండి జూలై, ఆగస్టు నెల చివరి కాయ వరకు ఎంత పంట వస్తుందో దానంతటిని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే రూ.4 మద్దతు ధర ఆగిపోతుందనే అపోహ వలన ఎక్కువ మంది రైతులు పంటని కోత చేసి త్వరగా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారని తెలిపారు. పల్ప్ యూనిట్ యొక్క స్టోరేజ్ సామర్థ్యం, ప్రాసెసింగ్ సామర్థ్యానికి మించి మనము తీసుకెళ్తే అక్కడ వెయిటింగ్ టైమ్ పెరుగుతుందన్నారు. దానిని నివారించడానికి మామిడి రైతులందరూ నెమ్మదిగా



మామిడి రైతులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

పక్వానికి వచ్చినటువంటి కాయలను మాత్రమే తీసుకురావాలని, ఆగస్టు మొదటి వారం వరకు చివరి కాయవరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఉద్యానవన శాఖ ద్వారా ఏపీ రైతు పంట ఎప్పుడు కోతకు వస్తుందో నిర్ణయించి వాటిని వ్యాపారులతో అనుసంధానించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఒక సమాచార కేంద్రంను ఏర్పాటు చేస్తామని, ఇది 24/7 అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎప్పటివరకు పంట వస్తే అప్పటివరకు ప్రభుత్వం తోతాపురి రకం మామిడి పంటకు రూ.4 మద్దతు ధర కల్పిస్తుందని తెలిపారు. ఉద్యాన, వ్యవసాయ ఉద్యోగుల ద్వారా ప్రతి రైతుకు, రైతు గ్రూపులకు ఫోన్ చేసి వారికి సమాచారాన్ని అందజేసి వారి దగ్గర పండే పంటను టోకెన్ పద్ధతి ద్వారా వ్యాపారులకు, పల్ప్ యూనిట్‌లకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుభాషిని, మండల ఉద్యాన శాఖ అధికారి ఎం.వి.భాస్కర్, మండల వ్యవసాయ శాఖ అధికారి సందీప్, ఎంపిడిఒ నాగార్జునరావు, తహశీల్దార్ అమర్నాథ్, సర్పంచ్, సంయుక్త మామిడికాయల మండీల యజమానులు, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి : పిజిఆర్ఎస్‌లో వచ్చే రెవెన్యూ సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం, యోగాంధ్ర 2025 మాసోత్సవాల కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే రెవెన్యూ సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్జీదారునితో నేరుగా మాట్లాడి మార్గదర్శకాల ప్రకారం వేగంగా పరిష్కరించాలని పేర్కొన్నారు. పరిష్కారం కానీ సమస్యను ఎందుకు పరిష్కరించలేదో అర్జీదారునికి తెలియజేసి, వారికి అవగాహన కల్పించాలన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మిగులు భూమిపై సిసిఎల్ఎ నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వచ్చిన తర్వాత ఈ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నెల 21వ తేదీన మాస్ యోగ కార్యక్రమానికి సంసిద్ధత కావాలన్నారు.

అంధకారంలో 'ఆరోగ్యవరం'

- రూ.90 లక్షలకుపైగా విద్యుత్ బిల్లుల బకాయి
- నోటీసులిచ్చినా స్పందించని మేనేజ్‌మెంట్
- విద్యుత్ సరఫరా ఆపేసిన అధికారులు
- అవస్థలు పడుతున్న రోగులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడి వ్యాధి నివారణకు ప్రసిద్ధి చెందిన ఆరోగ్యవరం మెడికల్ ప్రస్తుతం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. రోగులు అవస్థలు పడుతున్నారు. మదనపల్లె సమీపంలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ (శానిటోరియం) ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. టిబి వ్యాధికి వైద్యం అందిస్తూ ఎంతో ప్రఖ్యాత ఘడించిన ఆసుపత్రికి గడ్డుకాలం దాపురించింది. కొత్త మేనేజ్‌మెంట్ వచ్చిన తర్వాత రోజు రోజుకు రోగుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు అరకొర గానే సేవలందుతున్నాయి. రూ.లక్షల్లో కరెంట్ బిల్లులు బకాయి పడడంతో మేనేజ్‌మెంట్‌కి మదనపల్లె ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం షాక్ ఇచ్చారు. సుమారు రూ.90 లక్షలకు పైగా కరెంట్ బిల్లులు బకాయి ఉండడం, నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో కరెంట్ సరఫరా నిలిపేశారు. ఆ ఆసుపత్రి అంధకారంలోకి వెళ్ళింది. రోగులకు సేవలు నిలచి పోయాయి. విద్యుత్



ఆరోగ్యవరం మెడికల్ సెంటర్

పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని రోగులు మేనేజ్‌మెంట్‌ను కోరుతోంది. ఈ విషయమై ట్రాన్స్‌కో ఎఇ రమేష్‌ను వివరణ కోరగా.. కరోనా సమయం నుంచి ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ మేనేజ్‌మెంట్ కరెంట్ బిల్లులు చెల్లించక పోవడంతో రూ.90 లక్షలకు పైగా బకాయిలు పేరుకుపోయాయన్నారు. బిల్లులు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా స్పందించక పోవడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేశామని తెలిపారు.

మళ్లీ పురుగుల బియ్యంతోనే భోజనం

- డిఇఒ ఆదేశాలు పట్టని ప్రిన్సిపల్
- విద్యార్థి సంఘాల నిరసనతో పడేసిన బియ్యం
- ప్రిన్సిపల్‌పై చర్యలకు తహశీల్దార్‌కు ఫిర్యాదు



ఆదర్శ పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ మలం షావలి డిఇఒ ఆదేశాలను బేఖాతర్ చేశారు. ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం ఇవ్వవలసి ఉండగా పాత బియ్యాన్ని ఇస్తూ డిఇఒ ఆదేశాలను పట్టించుకోలేదు. మంగళవారం ప్రజాశక్తిలో 'మధ్యాహ్న భోజనంలో పరుగులు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపల్ పాత బియ్యాన్నే వంట ఏజెన్సీలకు ఇవ్వడాన్ని గుర్తించారు. విద్యార్థి సంఘాల నాయకులు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న ప్రిన్సిపల్ వంటకు నీటిలో నానబెట్టిన పాత బియ్యాన్ని సంచుల్లో నింపి స్కూల్ ఆవరణ బయట పడవేశారు. ఈ విషయాన్ని విద్యార్థి నాయకులు గుర్తించి వాటిని స్థానిక తహశీల్దార్ మహేశ్వరిబాయికి ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ స్పందించి ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రిన్సిపల్‌పై చర్యలు తీసుకోవాలి : విద్యార్థి సంఘాలు

ప్రిన్సిపల్ మలం షావలిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలలో తనిఖీ అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, టిఎన్ఎస్ఎఫ్, ఎన్ఎస్‌యుఐ సంఘాలకు చెందిన విద్యార్థి నాయకులు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని మధ్యాహ్న భోజన పథకం కోసం సరఫరా చేయుచున్నా, ఆ బియ్యాన్ని వాడకుండా పాతవి, పురుగులు పట్టిన బియ్యాన్ని వాడుతూ విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది విద్యార్థుల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదం కలిగించే అంశమని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల పోషకాహార అవసరాల కోసం వారానికి మూడు కోడిగుడ్లు, చిక్కీలు ఇవ్వాలని సూచించినా, అవి విద్యార్థులకు సకాలంలో ఇవ్వకుండా నిల్వచేసి చెడిపోవడం వల్ల చెత్తకుప్పలలో పారేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయని



పడేసిన పురుగులు బియ్యం

పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ నిధుల దుర్వినియోగమే కాక, విద్యార్థుల హక్కులపై జరిగిన నేరంగా భావించాలన్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు వ్యవహారాలను ప్రశ్నిస్తూ, విద్యార్థుల ఆరోగ్యం, హక్కులను కాపాడాల్సి ఉందన్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై విచారణ జరిపి, సరఫరా అయిన కోడిగుడ్లు, చిక్కీలు సకాలంలో విద్యార్థులకు అందుతున్నాయో లేదో పరిశీలించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని, దీనికి బాధ్యులైన ప్రిన్సిపల్‌పై ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అమృత తేజ, నాయకులు సాయి సంపత్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.కార్తీక్, బి.యువరాజు టిఎన్ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్బూరి చంద్రబాబు నాయుడు, డిబిఎస్ఎఫ్ నాయకులు బి.భాను తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను, స్కాలర్‌షిప్‌లను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్.నరసింహ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ 23-24, 2024-25 విద్యా సంవత్సరంలో ఒక విడత మాత్రమే విడుదల చేసిన ప్రభుత్వం పూర్తిగా ఉన్నత విద్య చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమై కూడా అనేకమంది విద్యార్థులు ఇంజనీరింగ్, ఎంబిఎ, ఎంకామ్ వంటి ఉన్నత వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకొని సర్టిఫికెట్ల కోసం కళాశాల యాజమాన్యాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏదైతే పాతబకాలు ఉన్నాయో వాటిని విడుదల చేస్తామని చెప్పి రూ.300 కోట్ల మాత్రమే విడుదల చేసి కంటి తుడుపు చేయడం తప్ప మరొకటి కాదన్నారు. మిగిలిన రూ.4700 కోట్ల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకంతో 2025-26 విద్యాసంస్థల సంబంధించింది రూ.8750 కోట్లు మాత్రమే విడుదల చేశారు. తప్ప స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌పైన ఎటువంటి స్పష్టమైన ప్రకటన చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ ఆరు క్వార్టర్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులను ఐక్యం చేసి జిల్లా వ్యాప్తంగా ఉద్యమ కార్యచరణ ప్రకటించి ఆందోళన కార్యక్రమాలు నిర్వహి స్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు లతీఫ్, మదన్మోహన్, దివన్, విజయ్, శ్రీనివాసులు, మదన్‌సాయి, పూర్ణచంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అజయ్‌కుమార్‌బాబు

డైట్ మ్యాగజైన్ కోసం రచనలకు ఆహ్వానం


ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా విద్యా శిక్షణ సంస్థ వెలువరించే నెలవారీ పత్రికలో ప్రచురణ కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థుల నుండి రచనలను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ అజయ్ కుమార్ బాబు తెలిపారు. మంగళవారం స్థానిక డైట్ విద్యా కేంద్రంలో పత్రికపై అధ్యాపకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా విషయక విజ్ఞాన అంశాలతో పత్రిక ఉండాలన్నారు. పాఠశాలల్లో అమలు చేసే వినూత్న పద్ధతులు, సృజనాత్మక బోధన విధానాల గురించి పత్రిక ద్వారా తెలియజేయ వచ్చన్నారు. అనంతరం పత్రిక ఎడిటర్, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు పత్రిక కోసం వ్యాసాలు, కవితలు, గేయాలు పంపవచ్చన్నారు. రచనలు తమ స్వంతమేనని, ఇంతవరకు ప్రచురితం కాలేదని రచనతోపాటు ధ్రువీకరణ పత్రం పంపాలన్నారు. కార్యక్రమంలో అధ్యా పకులు గిరిబాబు యాదవ్, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, సుబ్బారెడ్డి, కేదార్నాథ్, రెడ్డయ్య, మోహన్ నాయక్, కలీముల్లా పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లె ఉన్నత పాఠశాలలో చదువుతున్న 25 మంది విద్యార్థులకు ఎన్‌సిసి శిక్షణా సర్టిఫికెట్లను అందజేశారు. మే నెల 17 నుంచి 26 వరకూ చిత్తూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో కమాండింగ్ ఆఫీసర్ నోయల్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి విభాగంలో శిక్షణ ఇచ్చారని ఇంగ్లీష్ టీచర్ యోగేంద్ర తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంగళవారం ప్రధానో పాధ్యాయులు శ్రీనివాసులు, ఎస్ఎంసి ఛైర్మన్ శివకుమార్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిసితో విద్యార్థుల్లో నాయకత్వ క్రమశిక్షణతో పాటు నాయకత్వ లక్షణాలు అలవడు తాయని అన్నారు. దేశ రక్షణకు రక్షకులుగా యువత ముందుడుగు వేయాలని కోరారు.



ఎన్‌సిసి విద్యార్థులతో అధికారులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పట్టణంలోని పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1980లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం సమావేశమయ్యారు. 60సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక శ్రీ సత్యసాయి సేవా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1980లో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు జూలై 6వ తేది ఆదివారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు తప్పనిసరిగా హాజరై అప్పటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకోవాలని, ప్రతి ఒక్కరి జీవిత ప్రయాణంలో పొందిన అనుభవాలను పరస్పరం పంచుకోవాలని కోరారు.

ఆంధ్ర సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు ఎంపికైన పూర్విజా

ప్రజాశక్తి-నందలూరు

ఆంధ్ర సౌత్ జోన్ క్రికెట్ జట్టుకు నందలూరు విభా ఏరుడైట్ స్కూల్‌కు చెందిన హనుమంతు పూర్విజా ఎంపిక అయినట్లు క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫైరోజ్ ఖాన్‌లోడీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్విజ స్థానిక సబ్ సెంటర్‌లో ఫాస్ట్ బౌలింగ్‌లో శిక్షణ పొందుతూ క్రమశిక్షణతో శ్రమించి ప్రాక్టీస్ చేస్తూ జిల్లా జట్టుకు ఎంపిక కావడం జరిగిందని అన్నారు. తన ఫాస్ట్ బౌలింగ్‌తో నెల్లూరు జిల్లాలో జరి గిన జిల్లా క్రికెట్ మ్యాచ్‌లలో నెల్లూరు, అనంతపురం, కర్నూలు, చిత్తూ రు జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో అన్ని జిల్లాల మీద మంచి వికెట్లు సాధి ంచి అండర్-15 విభాగంలో ఆంధ్రా సౌత్ జోన్ జట్టుకు ఎంపిక కావడం జరిగిందని అన్నారు. తనను ప్రోత్సహించి సౌత్ జోన్ జట్టుకు ఎంపిక అయ్యేలా శిక్షణ ఇచ్చిన సిఎవైడి స్థానిక క్రికెట్ సబ్ సెంటర్ కోచ్ లు గయాజ్, కోచ్ ఫిరోజ్ ఖాన్‌లాడి, ట్రైనర్ శివ కోటి,గ్రౌండ్స్ మెన్ హరి కృష్ణ, సిఎవైడి అధ్యక్షులు భరతరెడ్డి, కార్యదర్శి రెడ్డిప్రసాద్, డిసిఒ ఖాజా మైనుద్దీన్, ఉమెన్ క్రికెట్ కో-ఆర్డినేటర్ విష్ణు మోహన్‌లకు పూర్విజ ధన్యాదములు తెలిపారు.



పూర్విజా

వాహనాలు తనిఖీ నిర్వహించిన ఎంవిఐ

-రూ.32 వేలు జరిమానా, ఒక ఆటో సీజ్

ప్రజాశక్తి-పీలేరు : పీలేరు-రాయచోటి రహదారిలోని పొంతలచెరువు క్రాస్ వద్ద ప్రత్యేక వాహనాల తనిఖీ చేసినట్లు పీలేరు ఎంవిఐ విజయ కుమారి, ఆర్‌టిసి డిఎం నిర్మల తెలిపారు. మంగళవారం వారు పీలేరు మండలం, పొంత లచెరువు క్రాస్ వద్ద నిబంధనలకు వ్యతిరేకంగా నడు పుతున్న ప్యాసింజర్ వాహనాలు, ఆటోలను ఆపి తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆరు వాహనాలను తనిఖీ చేసి నిబంధనలకు వ్యతిరేకంగా ప్రయాణి కులను తరలి స్తున్న ఆటో దారులకు రూ.32 వేలు జరిమానా విధించి, ఒక ఆటోను సీజ్ చేసినట్లు చెప్పారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఆటోల్లోంచి ప్రయాణికులను ఆర్‌టిసి బస్సులు ఎక్కించి, ఆర్‌టిసి బస్సుల్లోనే ప్రయాణం సౌకర్యం, సురక్షితమని వారికి తెలిపారు. ఈ తనిఖీలో వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. తనిఖీల్లో ఆర్‌టిసి ఉద్యోగులు కెసిఎస్‌రెడ్డి, బాబునాయక్, ఎడిసి కెఎన్ రెడ్డి, ఎంవిఐ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకోం

- టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్

ప్రజాశక్తి.. మదనపల్లె

కూటమి ప్రభుత్వంపై వైసిపి నాయకులు విమర్శలు చేస్తే చూస్తు ఊరుకోమని టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్ అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, పెద్దిరెడ్డి స్క్రిప్ట్‌ను చదువుతున్నారని విమర్శించారు. అభివృద్ధి అంటే ఏమిటో తెలియని వైసిపి నేతలు మూర్ఖుల్లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని అడ్డగోలుగా విమర్శిస్తూ, గంజాయి మత్తులో బడుగు, బలహీన, దళిత వర్గాలపై దౌర్జన్యాలకు పాల్పడు తున్నారని తీవ్ర విమర్శించారు. పల్లెపండుగ పేరుతో నియోజకవర్గ వ్యాప్తంగా రూ.12 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం, జడ్పీ హైస్కూల్ ఆవరణంలో రూ.50 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలియాదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేను విమ ర్శించే ముందు వైసిపి నాయకులు లక్ష మంది పసుపు సైన్యాన్ని దాటాల్సి ఉంటుందన్నారు. అభివృద్ధికి అడ్డుపడే విధంగా వైసిపి చర్యలు ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు నీలకంఠ, మైనార్టీ నాయకులు ఎస్.ఎం.రఫీ, నాదేళ్ల శివప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్, బాలుస్వామి, లక్ష్మన్న, పురుషోత్తం, సర్పంచ్ ప్రభాకర్, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, రాధా, జాఫ్ఫ రున్నిసా, నందిని రాయల్, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జాన్ బాబు, ఆర్.ఎస్.షంషీర్, యుగంధర్, పెరవలి మధు, టౌన్ బ్యాంకు సోమ శేఖర్, చిన్న మహేష్, జోలిపాలెం చిన్ని పూల మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెండ్ల విద్యాసాగర్



ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలని నిరసన తెలుపుతున్న ఇస్కాఫ్ సభ్యులు

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని ఇస్కాఫ్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.శివకుమార్ పేర్కొన్నారు. భారత సహకార స్నేహ సంఘం (ఇస్కాఫ్) ఆధ్వర్యంలో మంగళవారం పాలస్తీనా సంఘీభావంగా నిరసనను తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సదస్సులో జి.వి.శివకుమార్ మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు వెంటనే ఆపాలన్నారు. యుద్ధం ఆపకపోవడం వల్ల లక్షల మంది అమాయక ప్రజలు, మహిళలు, విద్యార్థులు, పసి పిల్లలు ప్రాణాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనా ప్రజలు తిండి, నీళ్ల లేక వైద్యం అందక ప్రతిరోజు యుద్ధ భయంతో శ్మశాన గుట్టల్లో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా యుద్ధోన్మాదం కారణంగా ఇజ్రాయిల్‌కు ఆయుధాలను విక్రయించి మద్ధతునివ్వడం వల్లే ఈ యుద్ధం జరుగుతోందని పేర్కొన్నారు. లక్షల మంది అమాయక ప్రజల ప్రాణాలను ఇజ్రాయిల్ బలిగొంటుంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ యుద్ధం ఆపేందుకు ప్రయత్నించకుండా అమెరికాకు మద్దతు తెలపడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలన్నీ దీన్ని ఖండించాలని కోరారు. ఈ సదస్సులో ఇస్కాఫ్ నాయకులు శ్రీరాములు, ప్రసాద్, సుధాకర్, కోన భాస్కర్ పాల్గొన్నారు.

రామాంజులుకు డాక్టరేట్

ప్రజాశక్తి- కలకడ

మారుమూల గ్రామానికి చెందిన రామాంజులు పిహెచ్‌డి సంపాదిం చారు. సంబేపలి మండలం, సోమవరం గ్రామ పరిధిలోని అగ్రహారం చెందిన దగ్గుపాటి రామాంజులు శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం నుంచి అర్థ శాస్త్రంలో అత్యున్నత డిగ్రీ అయిన పిహెచ్‌డిపట్టా పొందారు. 'ఆంధ్ర ప్రదేశ్‌లో పర్యాటక రంగం పాత్ర' అన్న అంశంపై కర్నూలు జిల్లాలో ఎంపిక చేసిన పర్యాటక కేంద్రాల ప్రత్యేక అధ్యయనం అనే అంశం పై పరిశోధన చేసి థిసిస్ సమ ర్పించారు. పలు జాతీయ, అంతర్జాతీయ సెమినార్ లలో పర్యాటకానికి సం బంధించి పరిశోధన పత్రాలు సమర్పించారు. రిటైర్డ్ అర్థ శాస్త్ర ఆచార్యులు డి. క్రిష్ణమూర్తి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లా నగ రిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీనియర్ అర్థశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తు న్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, బంధుమిత్రులు అభినందన లు తెలిపారు. తన తొలి గురువు, తాత నారాయణ దీవెన, తల్లిదండ్రుల ఆశీ స్సులతో కుటుంబ సభ్యుల సహకారంతో ఈ డిగ్రీ సాధించినటు పేర్కొన్నారు. తన పిహెచ్‌డికి సహకరించని ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.




తహశీల్దార్‌ను సన్మానిస్తున్న డీలర్లు

తహశీల్దార్‌ను సన్మానించిన డీలర్లు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ వెంకటేశ్వర్లును మంగళవారం మండల చౌక దుకాణాలడీలర్లు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు చేర్చే విధంగా పనిచేయాలని తహశీల్దార్ సూచించారని అన్నారు. ప్రజలకు నిత్యవరులు సకాలంలో సక్రమంగా పంపిణీ చేసి ప్రభుత్వానికి మండలానికి మంచి పేరు తీసుకురావాలని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్, కృపావతి, ఆర్ఐ డీలర్లు బసిరెడ్డి, రమేష్, మహేశ్వరాజు, చిట్టిరెడ్డయ్య పెంచలయ్య, జివి.రమణ, చాన్‌బాషా పాల్గొన్నారు.

కన్నెమడుగు పశు వైద్యాధికారిగా విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



కన్నె మడుగు పశు వైద్యాధికారిగా, గుండ్లపల్లె పశు వైద్యశాల ఇన్‌ఛార్జిగా డాక్టర్ విక్రమ్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. పెద్దమండ్యం మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. మండలం లోని పాడి రైతులకు మెరుగైన సేవలు అందించడం తో పాటు అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రైతులకు చేరువ చేసే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ సుజన శ్రీ కురబలకోటకు బదిలీ అయ్యారు.

బాధ్యతలు చేపట్టిన రీసర్వే డిటి, జూనియర్ అసిస్టెంట్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బి.కొత్తకోట మండల రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా బాలాజీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో మదనపల్లిలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.ఇక్కడ రీసర్వే విధులు నిర్వహించిన అనీషా వాల్మీకిపురం కు బదిలీపై వెళ్లారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ మండల రెవెన్యూ శాఖ ద్వారా మెరుగైన సేవల ను ప్రజలకు అందించి,ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనతోపాటు జూనియర్ అసి స్టెంటుగా ప్రశాంత్ బాధ్యతలు చేపట్టారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన రీసర్వే డిప్యూటీ తహశీల్దార్, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ రెవిన్యూ అధికారులు సత్కరించి ఆహ్వానించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలమైన గోడలతో మా ప్రాణాలకు ముప్పు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మా పొరుగింటి వారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లు శిథిలావస్థకు చేరడంతో ఆ గోడలు కూలిపోతున్నాయని దీంతో మా కుటుంబానికి ప్రమాదం పొంచి ఉందని పట్టణంలోని మూడో వార్డు, జన్మభూమికాలనీకి చెందిన గుడితి రాజేశ్వరి కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాజేశ్వరి మాట్లాడుతూ మా ఇంటికి ఉత్తరం వైపున ఉన్న వారు 30 ఏళ్ల కిందట ఇంటిని నిర్మించడంతో ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరిందన్నారు. ఇటీవల కొంత గోడ కూలి మా ఇంటి వైపున పడిందన్నారు. ఆ సమయంలో మేము, ఆ ఇంటిలోని వారు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. దీంతో తాము మున్సిపల్ కమిషనర్ కు సమస్యను తెలియజేయగా స్పందించిన కమిషనర్ సమస్యను పరిష్కరించాలని సచివాలయ సిబ్బంది ఆదేశించారన్నారు. దీంతో పరిశీలించిన సిబ్బంది శిథిలావస్థకు చేరుకున్న ఇంటిని తొలగించి నూతనంగా ఇంటిని నిర్మించుకోవాలని సూచించారన్నారు. అయినప్పటికీ ఇంటి యజమానులు కూలినచోటే పాత గోడలపైనే తిరిగి గోడను నిర్మిస్తుండగా తాము ఆక్షేపణ చేశామన్నారు.ఈ సమస్యపై సబ్‌కలెక్టర్, తహశీల్దార్, మునిసిపల్ కమిషనర్లకు అర్జీలు ఇచ్చామన్నారు. పాడుబడిపోయిన గోడలని తొలగించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారని, భవిష్యత్తులో గోడలు కూలితే ప్రాణాలకు ప్రమాదమని తెలిపాం న్నారు. మేము చేనేత మగ్గాలు నేస్తూ జీవనం సాగిస్తున్నామని,ఇప్పటికైనా సచివాలయం సిబ్బంది స్పందించి శిథిలావస్థకు చేరిన గోడలను పరిశీలించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.



బిసి రిజర్వేషన్ సాధక కమిటీ సభ్యులకు స్వాగతం పలుకుతున్న బలిజ కులస్తులు

బలిజలను బిసి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్రంలోని బలిజ, తెలగ, కాపు, ఒంటరి కులాలను బిసి జాబితాలో చేర్చాలని బిసి రిజర్వేషన్ సాధక కమిటీ నాయకులు సానా ప్రసాద్ డిమాండ్ చేశారు. బలిజలను బిసి కులాలలో చేర్చాలంటూ శాంతియుతంగా చిత్తూరు నుంచి అమరావతికి 15 మంది బృందంతో బిసి రిజర్వేషన్ సాధక కమిటీ చేపట్టిన పాదయాత్ర మంగళవారం నందలూరుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక బలిజ సంఘం నేతలు పాదయాత్రకు ఘనంగా పూలమాల, శాలువాతో స్వాగతం పలికి, సంఘీభావం తెలిపారు. బలిజలు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. విద్యార్థులకు ఉద్యోగవకాశాలు లేక నిరుద్యోగులు మారారని అన్నారు. బలిజలను బిసి జాబితాలో చేర్చి బలిజల అభ్యున్నతి కృషి చేయాలని కోరారు. కాపు సామాజిక వర్గానికి చెందిన యువత ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వెళుతున్నారని అన్నారు. కాపులను బిసి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నేతలు కాంట్రాక్టర్ బుసెట్టి వెంకటసుబ్బయ్య, సుధీర్, కొట్టే శ్రీహరి, నారపుశెట్టి శివయ్య, ఉప్పుశెట్టి రెడ్డయ్య, పాటూరు రమేష్, హరి, భీమా ముని స్వామి, బాలాంజనేయులు, సుబ్రహ్మణ్యం, శ్రీరామ్‌హరినాథ్, నాగరాజు, పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ
నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పీలేరు

ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు గాయపడిన సంఘటన పీలేరు మండలంలో చోటు చేసుకుంది. మంగళవారం సంబేపల్లి మండలం, శెట్టిపల్లి గ్రామం, పాలెంగడ్డ హరిజనవాడకు చెందిన యాటా చంద్ర, యాటా సుబ్బరాయుడు వ్యక్తిగత పనులపై కారులో చెన్నైకి బయలుదేరారు. వీరి కారు చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై పీలేరు మండలంలోని ముడుపులవేముల వద్దకు చేరుకుంది. అదే సమయంలోచెన్నై నుంచి కర్నూలు వైపుకు వెళుతున్న ఇన్నోవా కారు రెండూ కూడా ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికులు బాధితులను 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో పాలెంగడ్డ హరిజన వాడకు చెందిన చంద్ర, సుబ్బరాయుడు, కారు డ్రైవర్ ప్రసన్నకుమార్, ఇన్నోవా కారులోని ఉదయ్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్య కోసం తిరుపతికి పంపారు. ఈ మేరకు పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోలార్‌తో ప్రజలకు అధిక లాభం : డిఇ

ప్రజాశక్తి-రామసముద్రం



రామసముద్రం : మాట్లాడుతున్న డిఇ గంగాధర్

విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ చార్జీలను తగ్గించుకునేందుకు విధిగా తమ ఇళ్లపైన సోలార్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌పిడిసిఎల్ డిఇ గంగాధర్ తెలిపారు. మంగళవారం రామసముద్రం ఎస్‌పిడిసిఎల్ ట్రాన్స్‌కో పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన విద్యుత్ సిబ్బందికి రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ గృహ వినియోగదారులకు ఒక కిలో వాట్ కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78వేలు రాయితీని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ప్రతి విద్యుత్ ఉద్యోగి తమ ఇళ్లపై కూడా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేసుకోవడం వలన విద్యుత్ వినియోగం తగ్గడంతోపాటు విద్యుత్ బిల్లులో 70 శాతం తగ్గుతాయన్న విషయాన్ని వినియోగదారులకు గుర్తుచేయాలని చెప్పారు. రాయితీ విషయాలను క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరిగా వినియోగదారులకు వివరించి వారు సోలార్ టాప్‌లను తమ ఇండ్లపై ఏర్పాటు చేసుకునేందుకు సహకరించాలని ఆయన సూచించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ మొత్తం నేరుగా వినియోగదారుల బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందని, వినియోగదారులు తమ వంతు వాటాగా కేవలం 15 శాతం వెచ్చిస్తే, మిగిలిన మొత్తం బ్యాంకులు రుణంగా ఇస్తాయని వివరించారు. కార్యక్రమంలో ఎడి హరి కుమార్, ఎఇ మస్తాన్‌వలి , ట్రాన్స్‌కో క్షేత్రస్థాయి ఉద్యోగులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: విద్యుత్ శాఖ ఎడిఇ సురేంద్ర నాయక్, ఎఇ నాగరాజా, స్థానిక టిడిపి నాయకులతో కలసి నిమ్మనపల్లి టీవీఆర్ ఫంక్షన్ హాల్ నందు నిమ్మనపల్లిలోని విద్యుత్ శాఖ అన్ని విభాగాలకు చెందిన విద్యుత్ సిబ్బందికి, ప్రజలకు ప్రధానమంత్రి సూర్య ఘర్ కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేస్తున్న సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకోవడం వలన విద్యుత్ వినియోగం తగ్గడంతోపాటు విద్యుత్ బిల్లులో 70 శాతం తగ్గుతాయన్న విషయాన్ని వినియోగదారులకు తెలియజేయాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విషయాలను, బ్యాంకుల ద్వారా అందుతున్న లోన్ సదుపాయాలను క్షేత్రస్థాయి సిబ్బంది తప్పనిసరిగా వినియోగదారులకు వివరించి సోలార్ రూఫ్ టాప్ లను వారు ఇంటిపై ఏర్పాటు చేసుకునేందుకు విద్యుత్ శాఖ సిబ్బంది సహకారం అందించాలన్నారు. వెంకోజిగారిపల్లెలో టిడిపి నాయకులు సుధాకర్ రావు మూడు కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ను ఇదివరకే ఏర్పాటు చేసుకోవడం జరిగిందని వివరించారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో తమ ఇంటికి కావలసిన విద్యుత్తును ఉత్పత్తి చేసుకోవడమే కాకుండా, అదనంగా మిగిలిన విద్యుత్తును ప్రభుత్వానికి తిరిగి విక్రయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఇనాగరాజా, డిటి సిరాజుద్దీన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్, రాధాకృష్ణ, టిడిపి నాయకులు రాజన్న, సుధాకర్ రావు, మల్లికార్జున, మహేష్ రెడ్డి, సర్పంచ్‌లు శ్రీవాణి నవీన్, నూతన కాలువ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు వితరణ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు టిడిపి నేత, డ్యాన్స్ రెడ్డెప్ప చేయూత అందించారు. తన కుమార్తె స్వప్న,వఅల్లుడు శివ, మురళిల సహకారంతో అమ్మచెరువుమిట్ట, చంద్రకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్‌బాషా హాజరు కాగా టిడిపి నాయకులు డ్యాన్స్ రెడ్డెప్ప, బొమ్మిశెట్టి పురుషోత్తం, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, కంచర్ల మల్లికార్జున నాయుడులు శాలువాలతో సత్కరించి, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మంత్రి నారా లోకేష్ నూతన సంస్కర ణలకు శ్రీకారం చుట్టారన్నారు. 67 లక్షల మందికి తల్లికి వందనం నిధులు జమ చేయడం, ఎస్ఆర్‌కెవి.ఎం కిట్లను అందజేయడం జరుగుతోందన్నారు. అదేవిధంగా 300 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యా సామాగ్రిని వితరణ చేసిన డ్యాన్స్ రెడ్డెన్న కుమార్తె స్వప్న, అల్లుడు శివలను ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లోనే కాకుండా సమాజసేవ కార్యక్రమాల్లో డ్యాన్స్ రెడ్డెప్ప కుటుంబం ముందుండడం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఒక్కరూ వీరి కుటుంబాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నోటు పుస్తకాలు, విద్యాసామగ్రిని అందించారు.

ప్రమాదంలో గాయపడ్డ స్నేహితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ములకలచెరువు

రోడ్డు ప్రమాదంలో గాయపడి కోమాలోకి వెళ్లిన వ్యక్తికి స్నేహితులు ఆర్థిక సాయం అందించి అండగా నిలబడ్డారు. ములకలచెరువు మండలం, కదిరినాథునికోట పంచాయతీ కాసిపల్లికి చెందిన జల్లా రామ్మూర్తి జెసిబి నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడు నెలల క్రితం రోడ్డు పక్కన వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని రోడ్డు పక్కన పడ్డాడు. ఈ ప్రమాదంలో రామ్మూర్తికి తలకు బలమైన దెబ్బ తగలడంతో కోమాలోకి వెళ్ళాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బెంగళూరులోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. రెండు నెలలుగా చికిత్స చేయించారు. సుమారు రూ.30 లక్షలు దాకా ఖర్చు చేశారు. కోమ నుండి బయటకు వచ్చి ఇప్పుడిప్పుడే కోలు కుంటున్న అతనికి జడ్‌పిహైస్కూల్‌లో 1988-89వ బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి చదువుకొన్న చిన్ననాటి స్నేహితులు విషయం తెలుసుకొని గ్రూపులో ఒకరినొకరు సమాచారం ఇచ్చుకొని ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించుకున్నారు. మంగళవారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన మిత్రుడిని సందర్శించి, కుటుంబాన్ని పరామర్శించి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి స్నేహితుడి కోసం ఆర్థిక సాయం అందించిన మిత్రులందరికీ రామ్మూర్తి భార్య కృతజ్ఞతలు తెలి పారు. పరామర్శించిన వారిలో నరసింహులు, ప్రతాప్ కుమార్, వెంకటకృష్ణ, మస్తాన్ వల్లి, సయ్యద్ బాషా ఉన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న స్నేహితులు

85 శాతం పథకాలు అమలు చేశామని చెప్పడం విడ్డూరం

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు 85 శాతం అమలు చేశామని చెప్పడం అపద్దమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు సంబంధించి 3 హామీలు ఇస్తే అందులో ఒక హామీ మాత్రమే ఇప్పటివరకు అమలైందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలకు సంబంధించి కొందరేమో మొత్తం అన్ని అమలు చేశామని గొప్పలు చెప్పడం శోచనీయం అన్నారు. ఏడాదిలో 40 శాతం మాత్రమే అమలు చేసిందని చెప్పారు. అమలు చేసిన వాటిని చూస్తే సామాజిక పెన్షన్ల పెంపును అమలు చేశారని చెప్పారు. తల్లికి వందనం పథకం ఏడాది తర్వాత అమలు చేశారని చెప్పారు. నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకే పెన్షన్ పథకాలు అమలు కాలేదని చెప్పారు. మహిళలకు మూడు హామీలు ఇస్తే ఒకటి మాత్రమే అమలు అవుతున్నట్లు చెప్పారు. 85 శాతం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసినట్లు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడానికిప్రధాన కారణం సూపర్ సిక్స్ హామీలే అన్నారు. కాబట్టి అమలు చేయని హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. 46 వేల మంది రైతులకు 1.18 కోట్లు ధ్యానం బకాయిలు రెండు నెలలుగా పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. జొన్నలకు సంబంధించి 76 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. రాగులకు సంబంధించి 33 లక్షలు పెండింగ్‌లో బకాయిలు ఉన్నాయాని చెప్పారు. అప్పు చెల్లించని కారణంగా శిరీష అనే మహిళను చెట్టుకు కట్టేసి బంధించడం సిగ్గు చేటు అన్నారు. ఇలాంటి ఘటన ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గంలో జరగడం హేమమైన చర్య అన్నారు. ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తులసిరెడ్డి కోరారు.


నారా లోకేష్ నుంచి పుస్తకాన్ని అందుకుంటున్న కొణిదెల లోకేష్

రాష్ట్రాభివృద్ధిలో మంత్రి లోకేష్‌ది క్రియాశీలక పాత్ర

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర అభివృద్ధిలో మంత్రి నారా లోకేష్ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని పట్టణానికి చెందిన యువ నాయకుడు లోకేష్ కొణిదెల పేర్కొన్నారు. మంగళవారం మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో మంత్రిని లోకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. యువగళం పాదయాత్రలో మధుర స్మృతులతో రూపొం దించిన వాయిస్ ఆఫ్ ద పీపుల్ పుస్తకాన్ని లోకేష్ కొణిదెలకు మంత్రి నారాలోకేష్ అందించారు. ఈ సందర్భంగా లోకేష్ కొణిదెల మాట్లాడుతూ ఐటీ మంత్రిగా రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులను తీసు కొస్తూ మరో వైపు తల్లికి వందనం అమలు చేసి విద్యాశాఖ మంత్రిగా విద్యార్థుల తల్లిదండ్రుల శెబాషఅనిపించు కున్నా రని అన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌కు సంపూర్ణ సహకారం అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- ఖాజీపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, ఇప్పటివరకు వ్యవసాయ రంగానికి సంబంధించి ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదదని గతంలో వైసిపి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేసిందని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి. రాఘవరెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఖాజీపేటలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఏడాది అవుతున్నా రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు ఇంత వరకు మంజూరు చేయలేదన్నారు.కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారని వారన్నారు.

ఉద్యోగాలకు 89 మంది యువత ఎంపిక

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

జాబ్ మేళాలో 89 మంది యువతీ యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం పట్టణంలోని న్యాక్ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆధ్వ ర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. అర్బన్ సిఐ చాంద్ బాషా మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇలాంటి జాబ్ మేళాలు ప్రతి నెలా జిల్లాలోని నియోజక వర్గలలో జరుగుతాయని వివరించారు. కార్యక్రమానికి 10 సంస్థల అధికారులు హాజరయ్యారని వివరించారు. మొత్తం 276 మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 89 మంది ఎంపికైనట్లు న్యాక్ బిల్డింగ్ ఇన్‌ఛార్జి చెన్నకేశవ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపి ఎస్ఎసిడిసి కో-ఆర్డినేటర్లు పృధ్వి, దివాకర్ పాల్గొన్నారు.

వ్యాధులపై అసెస్మెంట్ సర్వే

ప్రజాశక్తి- ఖాజీపేట : మండల పరిధిలోని మిడుతూరు ఆరోగ్యం కేంద్రం పరిధిలోని బక్కాయపల్లి గ్రామంలో నాన్ కమ్యూనికబుల్ వ్యాధులపై ఎన్‌సిడి 3.0 క్వాలిటీ అసెస్‌మెంట్ సర్వే నిర్వహించారు. సామాజిక వైద్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య కళాశాల డాక్టర్ చరిత, డాక్టర్ లక్ష్మీదేవి సర్వేను పరిశీలించారు. రక్త పోటు చక్కెర బరువు వంటి అంశాలను పరిశీలించారు. అనారోగ్యంతో ఉన్న వ్యాధిగ్రస్తులకు మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీజీ వైద్య సిబ్బంది, వైద్యాధికారి డాక్టర్ సుమన్, ఏఎన్ఎం ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బొడ్డురాచన్న వీధిలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బోడ్డు రాచన్న వీధిలోని శ్రీరా ముని ఆలయం వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్ర మం చేపట్టారు. వేంపల్లెలోని బొడ్డు రాచన్న వీధిలో ఇటీ వల నూతనంగా సీతారాముల ఆలయాన్ని నిర్మించారు. ఆలయం నిర్మించి 41 రోజులు కావడంతో మంగళవారం సీతారాముల ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయనకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి శాలువతో సత్కరించారు. అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించి ప్రజలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కొత్తూరు రెడ్డయ్య, బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప పాల్గొన్నారు.

క్రైం కార్నర్


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం, నిందితులతో అటవీశాఖ సిబ్బంది

ఎర్రచందనం దుంగలు స్వాధీనం
ఏడుగురు స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి-వీరబల్లి

ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5లక్షలు విలువైన ఆరు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి ఫారెస్ట్ రేంజ్ అధికారి వైసి.రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరబల్లి బీట్ రెవెన్యూ ఫారెస్ట్ చమురు డోన్ ప్రదేశంలో తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఈ తనిఖీల్లో తమిళనాడు రాష్ట్రం, తిరువన్నమలై జిల్లాకు చెందినవారు. ఎం గిరి, రామర్, మణికందన్, హరి వలయన్, చెన్న కృష్ణ, శంకర్, చెన్నప్పను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువ గల 6 ఎర్రచందనం దొంగలు, 4 గొడ్డళ్లు, ఒక రంపము, త్రాసు, ఒక కారును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీలు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రజిని, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు అనిల్‌కుమార్, లీల శ్రీహరి, సానిపాయి స్ట్రోక్ ఫోర్స్ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.**పీలేరు:** ద్విచక్ర వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీ శాఖ సంచారదళ నిఘా విభాగం డిఎఫ్ఒ ఎం.గురుప్రభాకర్ తెలిపారు. పీలేరులో మీడియాతో మాట్లాడుతూ సోమవారం రాత్రి తమ కార్యాలయానికి అందిన రహస్య సమాచారం మేరకు రాత్రి చిత్తూరు జిల్లా, కందూరు సమీపంలోని కలికిరి-సోమల రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా, కలికిరి వైపు నుంచి ఓ ద్విచక్ర వాహనం వేగంగా రావడాన్ని గుర్తించి ఆపేందుకు తమ సిబ్బందితో ప్రయత్నించామన్నారు. అయితే ఎర్రచందనం దొంగలు వాహనం ఆగకుండా వేగంగా ముందుకు దూసుకు వెళ్లారని చెప్పారు. అప్రమత్తమైన తాము ఆ వాహనాన్ని వెంబడించగా నిందితులు ఇరువురు సోమల సమీపంలో వాహనాన్ని, రెండు బస్తాల ఎర్రచందనం మొద్దులు విడిచి చీకట్లో పరారయ్యారని అన్నారు. ఎర్రచందనం దొంగలు ఉపయోగించిన వాహనాన్ని, ఎర్రచందనం మొద్దుల బస్తాలను స్వాధీనం చేసుకుని పీలేరు సంచారదళ నిఘా విభాగం కార్యాలయానికి తరలించామన్నారు. రెండు బస్తాల్లోనూ 92 కేజీల బరువు గల 36 మొద్దులు గుర్తించామన్నారు. అపాచీ ద్విచక్ర వాహనంతో సహా ఎర్రచందనం మొద్దుల విలువ సుమారు రూ.2.50లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ఈ దాడిలో డిఎఫ్ఒ తో పాటు ఎఫ్ఆర్ఒ ఎస్.చంద్రశేఖర్, ఎఫ్ఎస్ఒ కె.ప్రకాష్, ఎఫ్‌బిఒలు కె. ప్రతాప్, పి రెడ్డి ప్రసాద్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలపై మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మంగళవారం రామసముద్రం మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కాప్పల్లికి చెందిన సంతోష్ కె.అహల్య(27) కు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమా రులు రోషన్, రిషి ఉన్నారు. కుటుంబ సమస్యలపై భార్య భర్తలు గొడవపడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అహల్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షిమచిన వైద్యులు చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పాడుబడ్డ బావిలో మహిళ మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-రామసముద్రం

మండల కేంద్రం రామసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని చెంబకూరు గ్రామ సమీపంలోని ఓ పాడుబడిన బావిలో మంగళవారం 55 ఏళ్ల మహిళ మృతదేహం లభ్యమైనట్లు స్థానికులు తెలిపారు. కాపల్లి పంచాయతి చెన్నాఒడ్డిపల్లికి చెందిన రెడ్డెమ్మగా స్థానికులు గుర్తించారు. చెంబకూరు గ్రామ సమీపంలోని పాడుబడిన బావిలో శవమై కనిపించగా పోలీసులు పరిశీలించారు. ప్రమాదవశాత్తు జరిపడిందా..లేక హత్యా? ఆత్మహత్య అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య కేసులో..
భార్య ప్రమేయంపై పోలీసుల దర్యాప్తు
- హత్యలో పాల్గొన్న ఆరుగురి కోసం గాలింపు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భార్య కళ్లెదుటే భర్త హత్య వెనుక అసలు కథ ఎవరి? పోలీసులకే అంతు చిక్కని మర్డర్ మిస్టరీ లో ఎన్నో విస్తు పోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. మదనపల్లెలో వెలుగు చూసిన 33 ఏళ్ల గంగాధర్ అనే ఓ రియల్ ఎస్టేట్ ఏజెంట్ భార్య పిల్లల ఎదుటే ఆదివారం అర్ధరాత్రి అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో అతికారతంగా కర్రలు, బండరాళ్లతో కొట్టి చంపారు కొందరు దుండగులు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు హత్యకు గల కారణాలపై దర్యాప్తు వేగవంతం చేశారు. గంగాధర్ హత్య పలు అనుమానాలకు దారితీస్తోంది. హత్యలో అసలు నిజాలు రాబట్టే పనిలో పోలీసులు సొంత మనషులనే అనుమానిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. దుండగుల అసలు టార్గెట్ ఏంటన్న దానిపై పోలీసులు మల్ల గుల్లాలు పడుతున్నారు. రాత్రి 11 గంటల సమయంలో గంగాధర్ ఇంటి తలుపు ఎందుకు వెయ్యలేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇంట్లోకి చొరబడ్డ అరుగురు వ్యక్తులు గంగాధర్ ను భార్య వినీత, పిల్లల కళ్ళ ఎదుటే కర్తలతో దాడి చేసి బండ రాళ్లతో కొట్టి హత మార్చారు.గంగాధర్ కు ఉన్న శత్రుత్వం, గొడవలపై ఆరా తీసిన పోలీసులు భార్యను కూడా అనుమానించే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రంమలో హతుడు గంగాధర్ భార్య వినీతను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మరికొందరు అనుమానితులు సైతం విచారణ పేరుతో పీఎస్ కు తరలించారు. భార్య ప్రమేయం ఉందా.. లేదా అన్న కోణంతో పాటు అరుగురు ఆగంతుకులు కలిసి చేసిన ఈ హత్య వెనుక అసలు సూత్రధారి ఎవరన్నది పోలీసులకు సైతం మిస్టరీగా మారింది. సమగ్రమైన విచారణ చేపట్టి త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

వన్య ప్రాణులను వేటాడిన ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు: వన్యప్రాణులను వేటాడిన ఇద్దరిని మంగళవారం అటవీ శాఖాధి కారులు అరెస్టు చేశారు. మదనపల్లె ఎఫ్ఆర్ఒ జయప్రసాద్, ములకలచెరువు సెక్షన్ ఆఫీసర్ ముబీన్‌తాజ్ తెలిపిన వివరాల మేరకు.. ములకలచెరువు మండల పరిధిలోని బురకాయ కోట, వేపూరి కోట, నేరేడికొండ బీట్లలో వన్య ప్రాణులను వేటాడి, వాటి మాంసాన్ని విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ముబీన్ తాజ్ సిబ్బందితో మండలంలోని ఒడ్డిపల్లి సమీపంలోని వ్యవసాయ పొలాల్లో సత్యసాయి జిల్లా, కదిరి వీరాస్ కాలనీకి బాలాజీ, ములకలచెరువు రామాపురంకు చెందిన మంజు నాథలను పట్టుకుని, మాంసం, మారణాయుధాలు సీజ్ చేయడం జరిగిం దన్నారు. నిందితులపై 1972 వన్య ప్రాణుల చట్టం ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.


నిందితులను సబ్ జైలుకు తరలిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది